

కూటమితో మోక్షం

- గత ప్రభుత్వంలో పిల్లర్లకే పరిమితమైన భవనం
- నేడు రూ.1.6 కోట్లతో పనులు ప్రారంభం
- నాలుగు నెలల్లో పూర్తి చేసేలా ఆదేశాలు



ప్రస్తుతం జరుగుతున్న కళాశాల భవన నిర్మాణ పనులు



గత ప్రభుత్వంలో ఆగిపోయిన భవన నిర్మాణం (ఫైల్)

సుండుపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ భవనానికి కూటమి ప్రభుత్వంలో మోక్షం లభించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడుతో ప్రభుత్వ బడుల తలరాతలు మారుస్తున్నామని డప్పు కొట్టారు. పేద విద్యార్థులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పిన మాటలు నీటిపై రాతల్లా మిగిలిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సుండుపల్లెలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జూనియర్ కళాశాల భవన నిర్మాణం పూర్తి చేయడానికి రూ.1.6 కోట్లతో టెండర్లు పూర్తి చేసి చకచకా పనులు చేస్తున్నారు. ఆదివారం కళాశాల భవన నిర్మాణానికి స్లాబ్ వేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. నాలుగు నెలల్లో పనులు పూర్తి చేసి ఆడబిడ్డలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పైఅధికారులు ఆదేశించినట్లు తెలిపారు. అంతకు ముందే పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

ఐదేళ్లుగా ఇవే కష్టాలు

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 250 మంది విద్యార్థినులు గత విద్యా సంవత్సరంలో విద్యను అభ్యసించారు. అలాగే జూనియర్ కళాశాలకు సంబంధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు గాను 67 మంది విద్యార్థినులు విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్కూల్ విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన భవనంలోనే జూనియర్ కళాశాల విద్యార్థినులు చదవాల్సిన పరిస్థితి గత ప్రభుత్వంలో విద్యార్థులకు ఎదురు కావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తగిన ల్యాబ్ సౌకర్యం లేకపోవడం, చదువుకునేందుకు సరైన గదులు అందుబాటులో లేకపోవడం, తరగతి గదులు సరిపోకపోవడం వంటి సమస్యలతో సతమతమయ్యారు. ఇదంతా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు గత ప్రభుత్వంలో ఆంధ్రజ్యోతిలో విద్యార్థుల కష్టాలు ప్రభుత్వానికి తెలిసేలా కథనాన్ని ప్రచురించడంతో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను, విద్యార్థులను సైతం గత ప్రభుత్వంలో పై అధికారుల ద్వారా వేధింపులకు గురి చేశారు. కాగా కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత ఇదే సమస్యపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ప్రభుత్వం వెంటనే టెండర్లు పిలిచి పనులు చేస్తుండటం విశేషం.

రక్షణ గోడను తీసేశారు

గత ప్రభుత్వంలో కాంట్రాక్టు పనుల కోసం మొదటి అంతస్తుకు ఉన్న రక్షణ గోడ కూడా తొలగించడంతో విద్యార్థినుల ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కు మంటూ కాలం గడిపారు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టు పనుల కోసం రక్షణ గోడను సైతం కూల్చివేశారు. అనంతరం దానిని నిర్మించలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం, పాఠశాల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం వలన ఈ సమస్యలు కొలువుదీరాయి. మొదటి అంతస్తులో విద్యార్థినులు గదుల్లో ఉండి చదువుకుంటున్నారు. అక్కడే నిద్రపోతున్నారు. అనుకోకుండా నిద్రమత్తులో అక్కడ నుంచి పడిపోయే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం రక్షణ గోడ కూడా నిర్మించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఒకపక్క ప్రహరీ కూడా పూర్తిగా నిర్మించలేదు. విష సర్పాలు పాఠశాలలోకి వస్తున్నాయి. ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించాలని ఉపాధ్యాయులు, విద్యార్థినులు కోరుతున్నారు.

తీరనున్న విద్యార్థినుల కష్టాలు



విద్యార్థుల కష్టాలను చూసి నిధులు మంజూరు చేసి పనులు జరిపిస్తుండడం సంతోషంగా ఉంది. పనులు పూర్తయితే విద్యార్థినుల కష్టాలు తీరతాయి. గతంలో గదుల కొరత వలన విద్యార్థినులు మెరుగైన విద్యకు దూరమయ్యారు. ల్యాబ్ సౌకర్యం లేదు. వీలైనంత త్వరగా కళాశాల భవన నిర్మాణం పూర్తి చేయాలి. మా కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఆంధ్రజ్యోతి దినపత్రికకు, నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

- శివశృతి, స్పెషలాఫీసర్, కస్తూర్బాగాంధీ విద్యాలయం, సుండుపల్లె

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి..

నాలుగు నెలల్లో పనులు పూర్తి చేస్తాము. రూ.1.6 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఇచ్చిన గడువు కంటే ముందే పనులు పూర్తి చేసేలా చూస్తాము. జిల్లా వ్యాప్తంగా కేజీబీవీలలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

- సుధాకర్‌బాబు, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

లక్షలు పోశారు..
లక్షణంగా వదిలేశారు!
- గొర్రెల సంతలో నిరుపయోగంగా భవనాలు



7

రెండు నెలలుగా పెరగని మిర్చి ధర



- పెట్టుబడులు కూడా రావని రైతుల ఆందోళన
- గిట్టుబాటు ధర కల్పించాలని వినతి

7

బీజేపీ నేత క్వారీపై 30 మంది గూండాల దాడి

- యంత్రాలు, లారీ అద్దాలు ధ్వంసం



గూండాల దాడిలో ధ్వంసమైన టిప్పర్ అద్దాలు

మదనపల్లె టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత జబ్బల శ్రీనివాసులుకు చెందిన క్వారీపై శనివారం రాత్రి 30 మంది గూండాలు దాడి చేశారు. క్వారీ వద్ద కాపలాగా ఉన్న కార్మికులపై దాడి చేయడమే కాక, క్రషర్ యంత్రాలు, టిప్పర్ లారీల అద్దాలను ధ్వంసం చేశారు. బాధితుడు శ్రీనివాసులు కథనం మేరకు.. తాను, తన భార్య కలసి మదనపల్లె మండలం కొండామరిపల్లె పంచాయతీ పరిధిలో అన్ని అనుమతులతో గాయత్రి స్టోన్ క్రషర్, క్వారీ నిర్వహిస్తున్నామన్నారు. క్వారీ బండలను క్రషర్ చేయించి కంకర, ఎం-సాండ్‌ను విక్రయిస్తున్నామన్నారు. ఇటీవల కొంతమంది తమ క్వారీ పక్కన ఉన్న డీకేటీ భూమి తమదే అంటూ ఆక్రమించుకున్నారన్నారు. దీనిపై మదనపల్లె కోర్టులో కేసు నడుస్తోందన్నారు. దీనిని కారణంగా చూపుతూ శనివారం రాత్రి 11గంటల సమయంలో ఓ రాజకీయ నాయకుడి ముఖ్య అనుచరుడి ఆదేశాలతో 30 మంది కర్రలు, రాళ్లతో వచ్చి తమ క్వారీలోని యంత్రాలను, టిప్పర్ అద్దాలను ధ్వంసం చేయడంతో పాటు, అక్కడ వున్న కార్మికులపై దాడి చేశారన్నారు. ఈ ఘటనలో సలీమ్ అలియాస్ శ్రీనివాసాచారి, సయ్యద్, అనిల్, వెంకటలక్ష్మి, ఆయేషా, రాజేశ్వరి ప్రమేయం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని మదనపల్లె తాలూకా పోలీసులకు బాధితుడు జబ్బల శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజల అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంతానం కోసం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు ఆలయంలో ఒరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన కడప, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



సంతానం కోసం ఒరపడుతున్న మహిళలు

అతిసార మరణాలను నివారిద్దాం

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉషశ్రీ



రాయచోటిటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డయేరియాపై అవగాహన కల్పించి అతిసార మరణాలను నివారిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. ఆదివారం ఆమె జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈనెల 16 నుంచి జూలై 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజుకు మూడు లేదా నాలుగుసార్లు పలుచగా నీళ్ల మాదిరిగా విరేచనాలు అయితే దానిని అతిసార వ్యాధి అంటారన్నారు. వీలైనంత వరకు అతిసార వల్ల సంభవించే మరణాలను ఓఆర్ఎస్, జింక్ చికిత్సతో పాటు సరిపడా పౌష్టికాహారం తీసుకోవడంతో నివారించవచ్చన్నారు. ఆశా కార్యకర్తలు, ఐదు సంవత్సరాలలోపు ఉన్న పిల్లలను గుర్తించి వారి ఇంటికి వెళ్లి ఓఆర్ఎస్, జింక్‌ను అందచేస్తారని అవి ఎప్పుడు వాడాలి, ఎలా వాడాలని అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న ఇంటికి రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు, కరపత్రం ఇస్తారని తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో అన్ని శాఖల సిబ్బంది, ఆరోగ్యశ్రీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అతిసారతో చనిపోయే ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాలను సున్నాకు తెచ్చే విధంగా అంకితం అవుదామని డాక్టర్ ఉషశ్రీ పిలుపునిచ్చారు.

సౌత్‌జోన్ బాలికల హాకీ విజేత కలికిరి సైనిక్ స్కూల్



చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న కలికిరి విద్యార్థినులు

కలికిరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ బాలికల టోర్నమెంట్ విజేతగా కలికిరి సైనిక్ స్కూల్ నిలిచింది. కర్ణాటక రాష్ట్రం కొడుగు సైనిక్ స్కూల్‌లో వారం రోజులుగా జరిగిన సౌత్‌జోన్ (ఇంట్రా గ్రూప్) హాకీ టోర్నమెంట్ జూనియర్ బాలికల (అండర్-17) విభాగంలో చాంపియన్ ట్రోఫీని కలికిరి సైనిక్ స్కూల్ బాలికల జట్టు కైవసం చేసుకుంది. ఆదివారంతో సౌత్‌జోన్ పోటీలు ముగిశాయి. టోర్నమెంట్ కోసం సౌత్‌జోన్ పోటీల్లో ఫైనల్‌గా నాలుగు ప్రీమియర్ సైనిక్ స్కూళ్లు పాల్గొన్నాయి. అమరావతి సైనిక్ స్కూల్ (తమిళనాడు), కలికిరి (ఏపీ), కడకూటం (కేరళ), కొడుగు (కర్ణాటక) జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శించిన కలికిరి బాలికల జట్టు ఫైనల్ మ్యాచ్‌లో కొడుగు సైనిక్ స్కూల్‌ను ఓడించి చాంపియన్‌షిప్ గెలుచుకుంది. ఈ టోర్నమెంట్‌లో టెస్ట్ ప్లేయర్ ట్రోఫీని కూడా కలికిరి సైనిక్ స్కూల్ విద్యార్థిని శ్రేష్ఠ కైవసం చేసుకుంది. ఈ విజయాన్ని చేజిక్కించుకున్న కలికిరి సైనిక్ స్కూల్ జట్టు జూలైలో జరిగే ఆల్‌ఇండియా సైనిక్ స్కూల్ హాకీ టోర్నమెంట్‌లో సౌత్‌జోన్ (గ్రూప్-హెచ్) తరఫున జాతీయ స్థాయిలో తలపడేందుకు అర్హత సాధించింది. కాగా సైనిక్ పాఠశాల మధ్య మొదటిసారిగా బాలికలకు కూడా హాకీ పోటీల్లో పాల్గొనడానికి అవకాశం కలిగించడం ద్వారా ఇది ఒక మైలు రాయిగా నిలిచిందని కలికిరి సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ సి.ఎస్.పరదేశి హర్షం వ్యక్తం చేశారు.

నయనానందకరం.. శ్రీవారి కల్యాణం





కడప కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రవణా నక్షత్రం సందర్భాన్ని పురష్కరించుకుని తిరుమల తొలిగడప దేవుని కడపలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం శ్రీదేవి- భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణం నయనానందకరంగా నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేకంగా స్వామి, అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించి భక్తులు ఆనంద పారవశ్యం పొందారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీఆర్పీఎఫ్‌లో పాసింగ్ అవుట్ పెరేడ్

కలికిరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలోని ఉగ్రవాద నిర్మూలన, తీవ్రవాద నిరోధక శిక్షణ సంస్థ (కౌంటర్ ఇన్‌సర్జన్సీ అండ్ యాంటీ టెర్రరిజమ్-సీఐఏటీ)లో చివరి ఘట్టం నాలుగు నెలల శిక్షణ పొందిన సైనికులకు మొట్ట మొదటి పాసింగ్ ఔట్ పెరేడ్ సోమవారం సీఐఏటీ ప్రాంగణంలో జరగనుంది. రిటైర్డు డీఐజీపీ, ప్రిన్సిపాల్ బ్రిగేడియర్ అనుపమ్ శర్మ శిక్షణ పూర్తి చేసుకున్న జవాన్లకు ట్రోఫీలు అందజేయనున్నారు. సీఆర్‌పీఎఫ్ అధికారులు, ఇతర జవాన్లు కుటుంబ సభ్యులతో పాల్గొననున్నారు.

తల్లికి వందనం లబ్ధి పొందిన చిన్నారులకు కేక్ తినిపిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



పేద విద్యార్థులకు పట్టం కట్టిన తల్లికి వందనం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు తల్లికి వందన పథకం ద్వారా ఈ ప్రభుత్వం పట్టం కట్టిందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్‌ను కట్ చేసి ప్రజలు, విద్యార్థులు, వారి తల్లులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తల్లుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నిధులు జమ కావడంతో విద్యలో వెలుగులు నింపిందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ఇప్పటికే ఎన్నికల సమయంలో చెప్పిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు ఉచిత బస్ ప్రయాణం తీసుకొచ్చేందుక ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నూలివీడు వెంకటశివారెడ్డి, మాజీ సర్పంచులు వెంకట్రామిరెడ్డి, బసయ్య, లక్కిరెడ్డిపల్లె మండల నాయకులు మదన్‌మోహన్, టీడీపీ మహిళా నేతలు సుజాత, నసీబ్‌జాన్, మస్తాన్‌బీ, మెహతాజ్, లక్ష్మీదేవి, లబ్ధిదారులు, తల్లులు, విద్యార్థులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

32 మందికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 32 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.32 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అందజేశారు.

విద్యాభివృద్ధికే తల్లికి వందనం

- టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లికి వందనం పథకం ఎంతో దోహదపడుతుందని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం ఏడాదిలోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంతో పాటు అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. పేదలు సంపన్నులు కావాలంటే ఏకైక మార్గం విద్య ఒక్కటేనన్న లక్ష్యంతో విద్యను ప్రతి పేదవానికి అందించాలన్న ఉద్దేశ్యంతో పాఠశాలలు ప్రారంభించే రోజే తల్లికి వందనం నగదును తల్లుల ఖాతాల్లో జమ చేయడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. గత ప్రభుత్వం 40 లక్షల మందికి అమ్మఒడి పథకం అందిస్తే కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మందికి తల్లికి వందనం పథకం కింద నిధులు జమ చేయడం దేశంలోనే ఒక చరిత్రగా నిలిచిపోతున్నారు. ప్రజలు సుఖసంతోషాలతో కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్ హుస్సేన్, మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, మాజీ ఎంపీటీసీలు బెల్లాల రమణయ్య, మోహన్‌బాబునాయుడు పాల్గొన్నారు.

3 వేల స్టాంపులు మాత్రమే వచ్చాయ్..

రైల్వేకోడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత ఉందని, ఈ-స్టాంపులను ఎక్కువ ధరకు అమ్ముతున్నారని ఈనెల 13న 'స్టాంపుల కొరత' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ప్రస్తుతానికి మూడు వేల నాన్ జ్యుడీషియల్ స్టాంపులను విడుదల చేశారు. అయితే ఒక్కొక్క వెండర్‌కు వంద స్టాంపుల చొప్పున ఇచ్చారు. అవి కూడా రూ.100 స్టాంపులే ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇచ్చిన మూడు వేల స్టాంపులు అయిపోతే మాత్రం మళ్లీ స్టాంపుల కొరత ఏర్పడుతుందని స్టాంప రైటర్లు అంటున్నారు. విజయవాడ ఐజీ కార్యాయలం నుంచి స్టాంపులు రావాల్సి ఉందని రిజిస్ట్రార్లు చెబుతున్నారు. సీరియల్ నెంబర్లు తప్పులుగా ఉన్న కారణంగానే స్టాంపుల కొరత ఉందని పలువురు చెబుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని స్టాంపుల కొరత లేకుండా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

లంకమలలో కూంబింగ్

సిద్దవటం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): లంకమల అభయారణ్యంలోని సమస్యాత్మక అటవీ ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించినట్లు సిద్దవటం రేంజర్ డి.కళావతి తెలిపారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ ఆదేశాలతో ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రోళ్లబోడు, గొల్లపల్లె, సిద్దవటం ఫారెస్ట్ బీట్‌లలో సమస్యాత్మక అనుమానిత అటవీ ప్రాంతాల ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించామన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచందనం స్మగ్లింగ్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. అటవీ ప్రాంతాలు ఆనుకుని ఉన్న పంట పొలాల్లోకి వన్యప్రాణులు సంచరిస్తే ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా గ్రామస్థులు వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ బీట్, సహాయ బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లె ఫారెస్ట్ బీట్ పరిధిలో కూంబింగ్ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

లక్షలు పోశారు.. లక్షణంగా వదిలేశారు!

పశుపోషకులు, కొనుగోలుదారుల సౌకర్యార్థం గొర్రెల సంతలో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. 14 ఏళ్ల క్రితం ప్రాంతీయ కృషి వికాస్ యోజన పథకం కింద రూ. 25 లక్షల వ్యయంతో ఈ భవనాలు నిర్మించారు. అధికారులు ఈ భవనాలను వినియోగంలోకి తేకుండా గాలికి వదిలేశారు. దీంతో కనీస వసతులకు నోచుకోని వ్యవసాయ మార్కెట్ యార్డులోనే వారపు సంతలు నిర్వహిస్తున్నారు.

- గొర్రెల సంతలో నిరుపయోగంగా భవనాలు
- అరకొర వసతుల మధ్య సంత నిర్వహణ
- వ్యాపారులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



వ్యాపారుల కోసం నిర్మించిన భవనం



గొర్రెల సంత కోసం నిర్మించిన షెడ్డు

పీలేరు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం, ఎర్రగుంటపల్లె పంచాయతీ పరిధిలోని నెట్టిబండ వద్ద రెండు ఎకరాల స్థలంలో గొర్రెల సంత ఏర్పాటుకు 2011, జనవరి 30న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. భవనాల నిర్మాణం కోసం రూ. 25 లక్షలు నిధులు మంజూరు చేశారు. సత్వరం నిధులు మంజూరు కావడంతో ఆగమేఘాల పై భవనాలు నిర్మించారు. వ్యాపారుల వెయిటింగ్ హాల్, భవన నిర్మాణం పూర్తి అయినా మార్కెట్ కమిటీ అధికారుల నిర్లక్ష్యంతో నాటి నుంచి నేటి వరకు నిరుపయోగంగా దర్శన మిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణ నడిబొడ్డున ఉన్న వ్యవ సాయ మార్కెట్ కమిటీ అవరణలో ప్రతి బుధవారం పశువుల సంత, ఆదివారం గొర్రెల సంత నిర్వహిస్తున్నారు. వారం వారం లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. తద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం బాగానే వస్తోంది. అయినా, వ్యాపారులు, రైతులకు గుక్కెడు తాగునీరు, టాయిలెట్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతుల కల్పనలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.

కూటమి ప్రభుత్వంలో కొత్తగా కొలువు దీరిన పాలక వర్గమైనా గొర్రెల సంత భవనాలను వినియోగంలోకి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది. అప్పట్లో సంత కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలం నేడు కోట్లాది రూపాయల విలువ చేస్తోంది.

మొదటి సమావేశంలో చర్చిస్తాం...



గొర్రెల సంత కోసం కేటాయించిన స్థలం ఎలా వినియోగించుకోవాలన్న అంశం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం మొదటి సమావేశంలో చర్చిస్తాం. రైతులకు వసతుల కల్పనతోపాటు మార్కెట్ కమిటీ ఆదాయ మార్గాలను పెంచుకోవడంపై నిర్ణయం తీసుకుంటాం. మార్కెట్ స్థలాన్ని ఆక్రమణల నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటాం.

-పురం రామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్

'ప్రతిభా పురస్కారం విద్యార్థి ఉన్నతికి దిక్సూచి'



ప్రతిభా పురస్కారాలందుకున్న విద్యార్థులతో కదిరి ఎమ్మెల్యే వెంకటప్రసాద్

కడప మారుతీనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):ప్రతిభా పురస్కారాలు విద్యార్థుల ఉన్నతికి దిక్సూచిలాంటివని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించే క్రమంలో వారిలో నూతనోత్తేజం నింపగలవని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన 59 మంది విద్యార్థులతోపాటు, కడప నగర పరిధిలోని ప్రయివేటు పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు నగదుతోపాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులంలోని వెనుకబాటుతనం, పేదరికం, అసమానతలు తొలగించే విధంగా ప్రతిభా పురస్కారాలను అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఉన్నతస్థానానికి వెళ్లిన తర్వాత కులానికి, సమాజానికి ఉపయోగపడినప్పుడే జీవితానికి నిజమైన సార్థకత సిద్ధిస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులు సైతం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించే ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్యా సుధాకర్, పల్లా నరసింహారావు, మాట్లాడుతూ15 ఏళ్లుగా సంఘం తరఫున ప్రతిభాపురస్కారాలు అందజేయడాన్ని అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులుగోవిందునాగరాజు, సూర్యనారాయణ, కె. భాస్కర్, సుబ్రమణ్యం, పి.మురళీ కృష్ణయ్య, చౌడం సూరిబాబు, ఎస్. ఆంజనేయులు, బి. చంద్రశేఖర్, సి. వెంకటేష్, బి. వెంకటస్వామి, డి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

స్వదేశానికి చేరుకున్న పుష్ప

పీలేరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కువైట్ లో కష్టాలు పడుతున్న కేవీపల్లె మండ లం గ్యారంపల్లెకు కురవపల్లెకు చెందిన పుష్ప ఆదివారం ఉదయం హైదరాబాదుకు చేరుకుంది. కువైట్‌లో తాను నానా ఇబ్బందులు పడుతున్నానని, తనను ఆదుకోవాలని ఆమె వీడియో ద్వారా నారా లోకేశ్ విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. కువైట్‌లోని ఎంబసీ, అక్కడి టీడీపీ ఎన్ఆర్‌టీ విభాగం నేతలతో మాట్లాడి ఆమెను స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు చేశారు. కువైట్ సభ్యులు ఆమెకు శనివారం రాత్రి విమానం టికెట్ బుక్ చేసి ఆదివారం ఉద యం విమానం ఎక్కించారు. తమ కుమార్తె హైదరాబాదులో సురక్షితంగా ఉన్నట్లు పుష్ప తల్లిదండ్రులు తెలిపారు. పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌ను సోమవారం విజయవాడలో కలిసిన తరువాత స్వగ్రామానికి వస్తుందని వారు తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నిమ్మనపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని వెంగంవారి పల్లి పంచాయతీ మద్యంవారిపల్లికి చెందిన రమణారెడ్డి (55) ద్విచక్ర వాహనంపై కందూరు వెళ్లి వస్తుండగా బాలినాయునిపల్లి సమీపంలో రంగారెడ్డి కాలనీకి చెందిన చంద్రశేఖర్ (45) నడుపుతున్న ఆటో ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన రమణారెడ్డిని ఆసుపత్రికి తరలించారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు యత్నిం చారు. ఆదివారం స్థానిక శేషమహల్ వీధికి చెందిన సురేష్(39) పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కు టుంబీకులు అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. బసినికొండకు చెందిన శివశంకర్(30) కూలి పనులు చేస్తుంటాడు. అతను కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు అతనిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్ట్

తంబళ్లపల్లె, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పేకాట కేంద్రంపై ఆదివారం నిర్వహించిన దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకుని, నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె మండలం కోటకొండ పంచాయతీ మండెంవారిపల్లెకు సమీపంలోని ఓ చింత చెట్టు కింద కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న ఏడుగురు పట్టుబడగా, ముగ్గురు వ్యక్తులు పారిపోయినట్లు తెలిపారు. అరెస్టయిన వారి నుంచి రూ.1,01,800లతో పాటు, 5 ద్విచక్రవాహనాలు, 10 సెల్‌ఫోన్‌ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రెండు కుటుంబాల ఘర్షణ

ముద్దనూరు జూన్15(ఆంధ్రజ్యోతి): వర్షపు నీటి మళ్లింపు విషయమై ఆదివారం అన్నదమ్ముల కుటుంబాల మధ్య ఘర్షణ జరిగినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. మండల పరిధిలోని రాజులగురువాయపల్లె లో పక్క పక్కనే నివాసం ఉన్న అన్నదమ్ములు పిల్లలు వర్షపు నీరు మళ్లించేందుకు ఇళ్ల వద్ద మట్టి కుప్పలు వేసుకున్నారు. ఈ విషయమై ఘర్షణపడగా ఒక కుటుంబానికి చెందిన రఘునాథరెడ్డి మరో ఇద్దరు, మరో కుటుంబానికి చెందిన పుల్లారెడ్డి మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పోరుమామిళ్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకేసులపల్లె అనుమానాస్పద స్థితిలో ఓమహిళ మృతి చెందింది. ఎస్ఐ కొండారెడ్డి తెలిపిన వివరాలిలా .. కలసపాడు మండలం చింతలపల్లెపంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన మహాలక్ష్మి (25)కి దమ్మనపల్లె పంచాయతీ పరిధిలోని సుంకేసులపల్లెకు చెందిన చెముడూరి నరేంద్రతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది, వీరికి ఆరేళ్లు, నాలుగేళ్ల వయసు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం నరేంద్ర తన అత్తకు ఫోను చేసి మహాలక్ష్మి ఉరి వేసుకుందని, తాను కూడా బతకనని చెప్పాడని ప్రస్తుతం అతని ఫోను కూడా స్విచ్ఛాఫ్ కావడంతో గాలిస్తున్నామన్నారు. మహాలక్ష్మి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాడి రైతుల జీవనోపాధుల పరిశీలన

సంబేపల్లె, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లె పంచాయతీ గాండ్లపల్లె గ్రామాన్ని ఆదివారం జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు ప్రతినిధి, నాబార్డు అధికారులు సందర్శించారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో గాండ్లపల్లెకు చెందిన 40 మంది పాడి రైతులకు నాబార్డు ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ఎస్ సంస్థ అంబ్రెల్లా ప్రోగ్రాం ఫర్ న్యాచురల్ రిసోర్స్ మేనేజ్మెంట్ (యూపీఎన్ఆర్ఎం) కింద గొర్రెలు, పశువుల కొనుగోలు కోసం సూక్ష్మరుణాలు మంజూరు చేసింది. 2020లో రుణాలు తీసుకున్న రైతులు తాము తీసుకున్న మొత్తాలను చెల్లించేశారు. గడిచిన ఐదేళ్లలో ఆయా రైతుల జీవన స్థితిగతులలో వచ్చిన మార్పులను ఆదివారం కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు ప్రతినిధి లుకినా, నాబార్డు డీడీఎం విజయ విహారి పరిశీలించారు. పాడి రైతుల ఆర్థికాభివృద్ధి, జీవనశైలి పెరుగుదలకు ఏమైనా చర్యలు తీసుకోవాలా అంటూ వారు రైతులను అడిగి తెలుసుకున్నారు.

ఆవులు, గొర్రెలను మేపుకుని గడిచిన ఐదేళ్లలో తాము ఎంతో అభివృద్ధి సాధించామని రైతులు వారికి తెలియజేశారు. ఆర్‌హెచ్‌జీబీ ఎంఎస్ఎస్ సంస్థ జనరల్ సెక్రటరీ బీవీ రత్నం గ్రామంలోని డెయిరీ యూనిట్లను వారికి చూపించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌హెచ్‌జీబీ ఎంఎస్ఎస్ సంస్థ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న బ్యాంకు, నాబార్డు ప్రతినిధులు

ఆధునిక తెలుగు కవిత్వానికి ఆద్యుడు శ్రీశ్రీ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు కవిత్వానికి ఆద్యుడు మహాకవి శ్రీశ్రీ అని రచయిత జింకా సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక జేవీవీ కార్యాలయంలో శ్రీశ్రీ వర్ధంతి సభను నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి ఆధునికత జోడించిన కవి శ్రీశ్రీ అన్నారు. సంప్రదాయ కవిత్వాన్ని ధిక్కరించి అభ్యుదయ భావాలతో ఆధునిక కవిత్వానికి పునాది వేశారన్నారు. మహాప్రస్థానం ద్వారా తెలుగు సాహితీరంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాడన్నారు. ఈ కార్యక్రమంలో విరసం వరలక్ష్మి, జనవిజ్ఞాన వేదిక సభ్యుడు ఆరవేటి చంద్రశేఖర్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, వెంకటసుబ్రమణ్యం, రామారావు, సహదేవుడు, సారథి, అక్షయ, తదితరులు పాల్గొన్నారు.



శ్రీశ్రీకి నివాళులు అర్పిస్తున్న జింకా సుబ్రమణ్యం తదితరులు

రెడ్డి సామాజిక వర్గం విద్యాపురోగతికి బాటలు

కడప కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థినుల విద్యా పురోగతికి రెడ్డి సేవాసమితి ఉపకార వేతనాలిస్తూ 25 ఏళ్లుగా ఉన్నత చదువులు చదివిస్తున్నదని రెడ్డి సేవాసమితి అధ్యక్షుడు కె. నాగిరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం రాజీవ్ మార్గ్‌లో గల రెడ్డి సేవాసమితి ప్రాంగణంలో సమితి సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. ఇంజనీరింగ్, వైద్య విద్యార్థులకు రెండు లక్షల రూపాయల ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. 20 25-26 విద్యా సంవత్సరానికి 8, 9, 10, తరగ తులలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అర్హు లైన 12 మంది బాలికలను ఉన్నత విద్య పాఠ శాలలో విద్యా బోధనతో పాటుగా కడపరెడ్డి హాస్టల్‌లో వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, నాయకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఆదినారాయణరెడ్డి, డి.రామ చంద్రారెడ్డి, పి. కుమారి, ఎన్. ఆనందకుమార్ రెడ్డి, ఎల్. మధుసూదన్‌రెడ్డి, సమితి సభ్యులు పాల్గొన్నారు.



సభనుద్దేశించి మాట్లాడుతున్న కె. నాగిరెడ్డి

17 నుంచి నరవాడ జాతరకు ప్రత్యేక బస్సులు

బద్వేలు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నరవాడ వెంగమాంబ జాతరలో భాగంగా ఈ నెల 17 నుంచి 19 వరకు బద్వేలు, పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండుల నుండి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ డీఎం నిరంజన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 మధ్యాహ్నం నుంచి 19న సాయంత్రం వరకు బద్వేలు ఆర్టీసీ బస్టాండు నుంచి పది ప్రత్యేక బస్సులు, పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండు నుండి ఐదు ప్రత్యేక బస్సులను వెంగమాంబ జాతరకు నడుపుతామన్నారు. సాధారణ బస్ చార్జీలే ఉంటాయని చార్జీల పెంపు ఉండదని అన్నారు. బద్వేలు , పోరుమామిళ్లకు చెందిన ప్రజలు జాతరకు వెళ్లేందుకు ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చైతన్య స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు శరవణకుమార్ మృతి



బి.కొత్తకోట, జూన్15(ఆంధ్రజ్యోతి): పట్టణ వాసులకు కొత్తగా పరిచయం అక్కరలేని చైతన్య శరవణకుమార్ ఆదివారం తుదిశ్వాస విడిచారు. వాయల్పాడు కు చెందిన శరవణకుమార్ (55) 1991లో బి.కొత్తకోటకు చేరుకొని చైతన్య స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. గ్రామస్థాయిలో రైతులను చైతన్యపరుస్తూ, ప్రభుత్వ సేవలు, పథకాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. వాటర్‌షెడ్, గ్రామాణాభివృద్ధి సంస్థల ద్వారా అనేక వ్యవసాయాధారిత పనులు చేయించారు. వివిధ స్థాయిల అధికారులను బి.కొత్తకోటకు రప్పించి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతు సేవా కార్యక్రమాలతో 30 ఏళ్లకు పైగా సేవలు అందించిన శరవణకుమార్ ఇటీవలికాలంలో అనారోగ్య కారణాలతో కాస్త విరామం తీసుకున్నారు. బి.కొత్తకోటలో స్థిరనివాసం ఏర్పరుచున్న ఆయన కోరిక మేరకు ఆదివారం వాయల్పాడు సమీపంలోని ఓ కుగ్రామంలో కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు పట్టణ ప్రముఖులు నివాళులు అర్పించారు.

రెండు నెలలుగా పెరగని మిర్చి ధర

● పెట్టుబడులు కూడా రావని రైతుల ఆందోళన

లింగాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధర పతనంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటకాలం ఇప్పటికే సగం పూర్తి కావడంతో పెట్టుబడులు అయినా వస్తాయో రావోనని రైతులు భయపడిపోతున్నారు. లింగాల మండలంలోని ఇప్పట్ల, చిన్నకుడాల, గుణకనపల్లె, అంబకపల్లె, లింగాల, మురారిచింతల, కోమన్నూతల తదితర గ్రామాలలో రైతులు ఫిబ్రవరి, మార్చి నెలల్లో మిర్చి సాగుచేశారు. ఎకరాకు రూ. 1.3 లక్షల వరకూ పెట్టుబడులు పెట్టారు. దిగుబడులు ప్రారంభమయ్యే సరికి ధర పతనం కూడా ప్రారంభమైంది. దీనికి తోడు తెగుళ్ల బెడద తీవ్రం కావడంతో సస్యరక్షణ చర్యలకు పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి వస్తోంది. దిగుబడులు మొదలైనప్పటి నుంచి 53 కేజీల బస్తా రూ.500 నుంచి రూ.700కు మించి పెరగడం లేదు. ఇందులో అధికభాగం కోత కూలి చెల్లించేందుకే ఖర్చవుతోందని, పెట్టుబడులు పోను తమకు ఏం మిగులుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. బస్తా ధర రూ.1500కు చేరుకుంటే తమకు కొంతైనా లాభం వస్తుందని అంటున్నారు.



మిరపకాయలు బస్తాలకు నింపుతున్న కూలీలు



మిరపకాయలు కోస్తున్న కూలీలు

గిట్టుబాటు ధర కల్పించాలి

ఎనిమిది ఎకరాల్లో పంట సాగుచేశా: పెట్టుబడి సుమారు రూ.9లక్షలు పైనే ఖర్చు అయింది. ఇప్పటికే రెండు కోతలు కోశాం. కూలీల ఖర్చు పోను రూ.2.50 లక్షలు వచ్చింది. సస్యరక్షణ చర్యలకు రూ.45 వేలు ఖర్చు అవుతుంది. ధరలు పెరిగితే తప్పమిర్చి రైతులు బాగుపడే పరిస్థితి లేదు. ప్రభుత్వం కల్పించుకొని మిర్చి రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలి

- వెంకటరామిరెడ్డి, రైతు,ఇప్పట్ల, లింగాల మండలం

పీలేరు వాసులకు కళాజ్యోతి పురస్కారాలు

పీలేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పీలేరుకు చెందిన ముగ్గురు కవు లు, ఒక నటుడు కళా జ్యోతి జాతీయ పుర స్కారాలు అందుకు న్నారు. చిత్తూరులోని భారతీయ తెలుగు రచ యితల సమాఖ్య, ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండే షన్ సంయుక్తఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రం 'తెలుగు తేజాలకు కళాభిషేకం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య, నటనా రంగంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖ కవి, తెలుగు భాషా సమితి అధ్యక్షుడు జలకనూరి మురళీధర్‌రాజు, బహుబాషా నటుడు ఖాదర్ బాషా, కవి సరస్వతి శ్రీరాములు రాజు, ఉపాధ్యాయుడు, కళాకారుడు చంద్రశేఖర్, విశ్రాంత డీటీ వెంకట శేషయ్య ఈ పురస్కారాలు అందుకున్నారు. నటకిరీటి రాజేంద్రప్రసాద్, గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లె రాధాకృష్ణన్ మనవడు సుబ్రహ్మణ్యం శర్మ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ప్రముఖ రచయిత, వక్త డా.నారాయణస్వామి, కార్యక్రమ నిర్వాహకులు ఎంవీ శ్రీధర్ రెడ్డి, మఱ్ఱిపూడి దేవేంద్ర రావు పీలేరు వాసులకు పురస్కారాలు ప్రదానం చేశారు.

కోదండరాముడి సన్నిధిలో పునుగోటి విశ్వనాథం

ఒంటిమిట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయాన్ని వెంకటగిరికి చెందిన తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగం కార్యదర్శి పునుగోటి విశ్వనాథం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కోదండరామున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంఘం డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, సామల లక్ష్మీపతి, జానపాటి మురళి, మేరువ యానాదిరావు, కొత్త శివ, అనుమల అయ్యప్ప, చింతగింజల సుధా, అవ్వారు రవిశంకర్, ఉప్పల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

కడపక్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన మేరువ సుబ్బమ్మ (73) ప్రస్తుతం కడప శ్రీనగర్ కాలనీలో ఉన్న కుమారుడు వద్ద ఉంటోంది. ఈ నెల 14న ఇంటినుంచి బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. కుమారుడు సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆచూకీ కనుగొన్న వారు 9121100520, 9121100521 తెలియజేయాలని వారు కోరారు.



మేరువ సుబ్బమ్మ

ప్రభుత్వ స్థలమే కదా.. పాడైపోతే మాకేంటి

అది మండల నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ స్థలం.. బాగుచేస్తే ప్రభుత్వ కార్యకలాపాలకు అనువైన ప్రదేశం.. అయినా అటు ప్రజాప్రతినిధులు గానీ, ఇటు అధికారులు గానీ 'అది ప్రభుత్వ స్థలమే కదా.. పాడైపోతే మాకేం' అన్న ధోరణితో దానివైపు కన్నెత్తి కూడా చూడని వైనం... ఇదీ చిట్వేలిలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం దుస్థితి...



చిట్వేలి మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ వసతి గృహం

- నిరుపయోగంగా ప్రభుత్వ వసతి గృహ భవనం
- మందుబాబులకు నిలయం
- బాగు చేస్తే ప్రభుత్వ కార్యకలాపాలకు ఎంతో అనుకూలం
- అయినా ఎవరూ పట్టించుకోని వైనం

చిట్వేలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన పలు భవనాలు నిర్లక్ష్యానికి గురై నిరుపయోగంగా మారుతున్నాయి. ఏళ్ల తరబడి వినియోగంలో లేకపోవడంతో ఆ ప్రభుత్వ భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. పైగా శిథిలావస్థకు చేరుకుంది. వివరాలు ఇవీ... చిట్వేలిలో నడిబొడ్డున ఉన్న భవనం మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. మరమ్మతులు చేసి కొన్ని భవనాలు వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం ఉన్నా ఆ దిశగా ఎవరూ ప్రయత్నం చేయడంలేదు. గత ప్రభుత్వ హయాంలో నూతన భవనాలు నిర్మించారే తప్ప పాత భవనాలను ఉపయోగించి ఉంటే నేడు ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకోవని విమర్శలు ఉన్నాయి. చిట్వేలిలో ఉన్న హాస్టల్ నేడు శిథిలావస్థకు చేరుకోవడమే ఇందుకు నిదర్శనం. 1997 సంవత్సరంలో సాంఘిక సంక్షేమశాఖ నిర్వహించిన ప్రభుత్వ బాలుర వసతి గృహం కేంద్రీయ వసతి గృహ భవనాలు నేడు నిరుపయోగంగా మారడంతో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. 2007 అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జిల్లా పరిషత్ ఆవరణంలో ప్రభుత్వ సమీకృత బాలురు వసతిగృహం హాస్టల్‌కు



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న హాస్టల్ ప్రాంగణం

శంకుస్థాపన చేశారు. 2010లో అప్పటి ఉమ్మడి ఎంపీ సాయిప్రతాప్ ఈ భవనాన్ని ప్రారంభించారు. పాత ఎస్సీ హాస్టల్ విద్యార్థులను నూతన భవనంలోకి తరలించారు.

అనంతరం ఖాళీ అయిన భవనంలో యేడాదిపాటు కస్తూర్బా పాఠశాలను నిర్వహించారు. చిట్వేలి అరుందతివాడ స మీపంలో కస్తూర్బా పాఠశాల నిర్మించడంతో పాఠశాల ఇక్కడి నుంచి తరలించారు. నాటి నుంచి భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంది.

నిర్మిస్తే ప్రభుత్వ సమావేశాలకు అనువైన ప్రదేశం

చిట్వేలి మండలంలో ప్రభుత్వ సమావేశాలకు అనువైన ప్రదేశం మచ్చుకైనా లేకపోయింది. ఉన్న కాస్తంత స్థలంలో ఇరికిరుకుగా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించబడ్డాయి. చిట్వేలి హాస్టల్ భవనం తొలగించి ఆ ప్రదేశంలో నూతన భవనాన్ని నిర్మిస్తే ప్రభుత్వ సమావేశాలకు నిర్మించుకోవచ్చు. అలాగే మండలంలో పేద ప్రజలకు ప్రభుత్వ కల్యాణ మండపం లేక అవస్థలు పడుతున్నారు. చిన్నాచితక నిరుపేదలు పెళ్లిళ్లు చేయాలంటే రాజంపేట, ఓబులవారిపల్లె కల్యాణ మండపాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆలోచిస్తే పేదలకు కల్యాణమండపాన్ని నిర్మిస్తే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రభుత్వం, నాయకులు ఆలోచిస్తే నిరుయోగంగా ఉన్న భవనం పేద ప్రజలకు ఉపయోగంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు అనువుగా ఉంటుంది. ప్రభుత్వం ముందడుగు వేసి శిథిలావస్థలో ఉన్న ఇటువంటి భవనాలను ఉపయోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

29న పాటల పోటీలు

రాజంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ బాలసుబ్రమణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కళాంజలి తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట పట్టణంలోని కాకతీయ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తి గీతాలు, తెలుగు సినిమా పాటల పోటీలు ఉంటాయన్నారు. రెండింటిలో పాల్గొనేవారు ఈనెల 20వ తేదీ లోపు ఎంట్రీ ఫీజు రూ.200 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి కళాంజలి గానకోకిల ఆల్విన్ అవార్డు, రెండో బహుమతి కళాంజలి గాన సరస్వతి, మూడో బహుమతి ఎస్పీబీ స్మారక గాన గాంధర్వ, నాలుగో బహుమతి ఎస్పీబీ స్మారక గాన స్వరార్చన, ఐదో బహుమతి పీవీఆర్ స్మారక, 6వ బహుమతి కళాంజలి పావన గంగ అవార్డులు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9490884300, 949044 3000కు సంప్రదించాలని ఆయన కోరారు.

మంత్రిని కలిసిన ఎక్సైజ్ సీఐ

రాయచోటిటౌన్, జూన్15(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఎక్సైజ్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గురుప్రసాద్ ఆదివారం రాయచోటిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలి సి పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

పట్టుదలతో అత్యున్నత స్థాయికి చేరుకోవాలి



నగదు అందజేస్తున్న మణిదీప్


నందలూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పట్టుదలతో చదివి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ప్రముఖ రంగస్థల నటుడు నంది అవార్డు గ్రహీత, కళాబంధు చిక్కాల బాలాజి రావు(ఆల్విన్ బాలాజీ) కోరారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలన్నారు. ఆయన సతీమణి దివంగత చిక్కాల జయలక్ష్మి స్మృత్యర్థం ఏర్పాటు చేసిన చిక్కాల జయలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం స్థానిక గ్రంథాలయంలో నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ ఏపీ రాష్ట్ర కన్వీనర్ అల్లం అశోక్‌కుమార్ మాట్లాడుతూ కలలను కనడం గొప్ప కాదని, వాటిని సాకారం చేసుకోవడానికి పట్టుదల, ఓర్పుతో కృషి చేసినవారే విజేతలు అవుతారని అన్నారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఎస్ఎండీ షఫీవుల్లా, జిల్లా నాయకుడు చలపాటి నరసింహారావులు మాట్లాడుతూ నేటి విద్యార్థులు సెల్‌ఫోన్లు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ సంస్థల్లో చదివి పదో తరగతి, ఇంటర్ చదివి అత్యధిక మార్కులు సాధించిన పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మణిదీప్ (10వ తరగతి), ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సాయికీర్తన్ (ఎంపీసీ)లకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు పురస్కారాలను అందజేశారు.

వేరుశనగ విత్తనకాయల పంపిణీ



విత్తనకాయలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రామాపురం, జూన్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీలోని గ్రామ సచివాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన వేరుశనగ విత్తనాకయలను శనివారం గ్రామ టీడీపీ నాయకుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నారాయణి రకం సంబంధించి 108 మంది రైతులకు గానూ 200 బస్తాలు పంపిణీ చేశామన్నారు. 30 కేజీల బస్తా రూ.1710 సబ్సిడీతో రైతులకు పంపిణీ చేశామన్నారు. ఎకరాకు ఒక బస్తా, రెండు ఎకరాలకు పైన ఉంటే రెండు బస్తాలు చొప్పున పంపిణీ చేశామన్నారు. టీడీపీ నాయకులు రామాంజనేయుల రెడ్డి, రైతు లు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా దేవరెద్దు ఏలుపు



ఏలుపునకు సిద్ధమైన దేవరెద్దు

పెద్దమండ్యం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శివపురం పంచాయతీ గొల్లపల్లిలో దేవ రెద్దు ఏలుపు ఘనంగా జరిగింది. గ్రామంలో ఇంటి ఇల వేల్పు దేవరెద్దు పుట్టిన మూ డేళ్లకు ఏలుపు నిర్వహిస్తా రు. మండలంలోని దేవ రెద్దుల సమక్షంలో ఆ దేవరెద్దు పళ్లెం పెట్టడం కోసమే ఏలుపు నిర్వహిస్తారని గ్రామ పెద్దలు వెల్లడించారు. ఈ సందర్భంగా దేవరెద్దులకు వివిధ పుష్పాలు, గజ్జెలు, పట్టీలు వివిధ రకాల వస్త్రాలతో ఆలకరిస్తారు. జాతర లాగానే ఈ దేవరెద్దు ఏలుపు జరుగుతుంది. కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిచారు. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ తక్షణం స్పందించాలి

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూన్15(ఆంధ్రజ్యోతి): ప్రతి సమస్యకూ తక్షణం స్పందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిన్నమండెం మండలంలోని తన నివాసమైన బోరెడ్డిగారిపల్లెలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి తక్షణమే పలువురు అధికారులను ఆదేశించారు. పలు సమస్యలకు ప్రత్యక్షంగా పరిష్కారాన్ని అందించిన మంత్రి ప్రజల్లో విశేష విశ్వాసాన్ని నెలకొల్పారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ పరిష్కారమే ప్రధానంగా ప్రతి సమస్యకు తక్షణ స్పందన, పరిష్కారమే లక్ష్యం చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

20 మంది కంటి రోగులకు ఆపరేషన్లు



కంటి రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, జూన్15(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 20 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, కలకడ, చక్రాయపేట, ఎన్‌పీకుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 40 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 20 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 32 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేశారు. కంటి వైద్య శిబిరానికి హాజరైన కంటి రోగుల సౌకర్యార్థం దాతలు భోజన వసతి కల్పించారు. కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన జమీర్ అక్బర్ బాషా

ఓబులవారిపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని టీడీపీ మైనార్టీ నేత సయ్యద్ జమీర్ అక్బర్ బాషా అన్నారు. ఓబులవారిపల్లె పంచాయతీలోని ముదినేపల్లె యువకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండో బహుమతి రూ.15 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు.



అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయరావు

పెనగలూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):తమ ముంగిటకు వచ్చిన అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.విజయరావు అన్నారు. ఆదివారం మండలంలోని కొండూరు పంచాయతీ పరిధి కొండూరు, చిన్నరాయసముద్రం ఎస్టీ కాలనీలో గ్రామ సర్పంచ్ అంజనమ్మ అధ్యక్షతన డజ్గా కార్యక్రమం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గ్రామ ప్రజలను సమావేశ పరిచి మాట్లాడారు. ఈనెల 30 వరకు గ్రామంలో కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. గ్రామ ప్రజలు ఆధార్‌కార్డు నమోదు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పీఎం కిసాన్ యోజన, జన్‌ధన్ యోజన, బ్యాంకు ఖాతా, ఆరోగ్యం కోసం హెల్త్‌కార్డు, సికిల్‌సెల్ వ్యాధి స్క్రీనింగ్, సంబంధిత కార్డులు జారీ చే స్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ గ్రామానికి కల్పించిందని, ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'చంద్రబాబువి అమలు కాని హామీలు'

రాయచోటిటౌన్, జూన్15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎన్నికల సమయంలో అమలు కాని హామీలు ఇచ్చారని వైసీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఆరోపించారు. ఆదివారం స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో అమర్‌నాథరెడ్డి, మదనపల్లి వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ కొందరికే పథకాలు అనేలా చంద్రబాబు వైఖరి ఉందన్నారు. వైసీపీ నేతలు శిబ్యాల విజయభాస్కర్, కొలిమి హారూన్‌బాషా, జానం రవీంద్రయాదవ్ పాల్గొన్నారు.

'గాలేరు-నగరి కాలువ పనులు ప్రారంభించాలి'

రైల్వేకోడూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గాలేరు-నగరి కాలువ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సీపీఐ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాక్రిష్ణయ్య, ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం లక్ష సంతకాల సేకరణ చేపట్టే కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష సంతకాల సేకరణలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23న రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హంద్రీ- నీవా కాలువ పనులు వెంటనే పూర్తి చేసి చెరువులు నింపాలన్నారు. తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయాలన్నారు. వెలిగల్లు, ఝరికోన ప్రాజెక్టుల కుడి, ఎడమ కాలువలు వెంటనే పూర్తి చేసి పూర్తి సామర్థ్యంతో తాగు నీరు, సాగు నీరు అందించాలన్నారు. కడప,-బెంగుళూరు రైల్వేలైన్ మదనపల్లె మీదుగా వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మదనపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనని వెంటనే పూర్తి చేసి మదనపల్లెకు సాగు నీరు అందించాలన్నారు. ఓబులవారిపల్లె-క్రిష్ణపట్నం ఓడరేవు రైల్వేలైన్‌లో ప్యాసింజర్ రైలును నడపాలని కోరారు. కడప-చెన్నై ప్రధాన దారి పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. మంగంపేట ముగ్గురాయి అక్రమ కాంట్రాక్టర్లను రద్దు చేయాలన్నారు. మామిడి, అరటి, బొప్పాయి పరిశ్రమలకు అనుగుణంగా పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. మదనపల్లెలో మెడికల్ కాలేజి పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కళాశాలను ప్రభుత్వం ద్వారానే నడిపి పేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి తుమ్మల క్రిష్ణచైతన్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం.గంగాధర్, యూనియన్ నాయకులు యాదయ్య, సీపీఐ మండల పార్టీ సహాయ కార్యదర్శి గంగాపూరి తేజ్‌కుమార్, నాయకులు గంగయ్య పాల్గొన్నారు.

'తల్లికి వందనంపై వైసీపీ దుష్ప్రచారం'

సిద్దవటం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనంపై వైసీపీ దుష్ప్రచారం తగదని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగుంట్ల రామక్రిష్ణ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ బంగారుపేట గ్రామంలో వెలసిన గంగాభవాని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తీర్పు ఇచ్చినా ఇంకా వారికి బుద్ధి రాలేదన్నారు. తల్లికి వందనం అమలుతో ప్రతి కుటుంబం హర్షాతిరేకాలను చూసి వైసీపీ నేతలు ఓర్వలేకున్నారని పేర్కొన్నారు.

ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులు

చిట్వేలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ప్రతిభ అన్వేషణ ఉపకార వేతనం(ఎన్ఎంఎంఎస్) పరీక్ష 2025 ఫలితాల్లో చిట్వేలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మాచిరాజు లిఖితసాయి, కోణిరెడ్డి హేమసాయిరెడ్డి, కారేటి యశ్వంత్ ఎంపికయ్యారని తెలిపారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఈ పరీక్షలు నిర్వహిస్తుందని, ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి యేడాదికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు మొత్తం రూ.48 వేలు వస్తుందని దుర్గరాజు తెలిపారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు.

దూదేకుల అభివృద్ధికి ఐక్యంగా పనిచేద్దాం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న దూదేకులు

రాజంపేట టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దూదేకుల అభివృద్ధికి ఐక్యంగా పనిచేయాలని నిర్వాహకులు గగ్గటూరి హుమయూన్ తెలిపారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో దూదేకుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూదేకుల కుల అభివృద్ధి సంక్షేమం ఐక్యత కోసం ప్రత్యేకంగా దూదేకుల వికాసం కార్యక్రమం దూదేకుల కేర్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దూదేకుల కేర్ ఫోర్స్ అనే మొబైల్ యాప్‌ను పరిచయం చేశారు. దూదేకుల సామాజిక, ఆర్థిక, విద్య, ఆరోగ్య ఉద్యోగ రంగాల్లో ప్రగతికి తోడ్పడే ఉద్దేశ్యంతో రూపొందించిన యాప్ ద్వారా దూదేకుల ప్రజలకు సమాచార సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన, విద్య, ఉపాధి అవకాశాలు, హక్కులపై అవగాహన, సమాజంలో ఐక్యత పెంపొందించే కార్యక్రమాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ ద్వారా దూదేకుల సమాజం మరింత అభివృద్ధిపథంలోకి వెళ్లాలని, అందరికీ ప్రయోజనం చేకూరాలని పేర్కొ న్నారు. హెల్ప్ లైన్ నెంబరు 9989624611ను విడుదల చేశారు. ఈ సమావేశంలో నిర్వాహకులు గగ్గటూరి హుమయూన్, సుంకేసుల చిన్నబాషా, చప్పలి కేశవ, వి.పీరయ్య విజయవంతంగా నిర్వహించారు. ముఖ్య నాయకులు, దూదేకుల కులస్థులు పాల్గొన్నారు.

క్షత్రియులందరూ ఐక్యంగా ఉండాలి



చైర్మన్‌ను సన్మానిస్తున్న క్షత్రియ సంఘం నాయకులు

రాజంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): క్షత్రియులందరూ ఐక్యంగా ముందుకెళ్లి అభివృద్ధి సాధించాలని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం క్షత్రియ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ సమావేశం భద్రాచలంలోని క్షత్రియ భవన్‌లో ఫెడరేషన్ చైర్మన్ వెంకపతిరాజు(పెద్దబాబు) భద్రాచలం, శ్రీరామ టెంపుల్ మాజీ ఈవో, క్షత్రియ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణరాజు ఆధ్వర్యంలో జరిగింది. సెకండ్ ఎగ్జిక్యూటివ్ సమావేశానికి రాజంపేట నుంచి కొండూరు శరత్‌కుమార్‌రాజు, చేజర్ల సుబ్రమణ్యంరాజు, శివరామరాజు, మోహన్‌రాజు, తిరుపతి నుంచి కోనేటి రఘురాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న క్షత్రియులందరూ ఐకమత్యంగా ఉండాలని, పేదలుగా ఉన్న క్షత్రియులను మన సం ఘాల ద్వారా వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించాలని సూ చించారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసి ఉన్నత చదువుల కోసం ప్రోత్సహించాలన్నారు. అనంతరం శరత్‌కుమార్‌రాజు, సుబ్రమణ్యంరాజు, రవిరాజు, శివరామరాజు, మోహన్‌రాజులను శాలువాలతో సత్కరించారు.

గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె, జూన్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం గ్రామంలో వెలిసిన గంగమ్మ తల్లికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. రాయలసీమకే తలమానికంగా నిలిచిన గంగమ్మ తల్లికి దూర ప్రాం తాల నుంచి ప్రతి ఆదివారం వేల సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ముడుపులు, బోనాలు, మొక్కుబడులు చెల్లించారు. వచ్చే భక్తులకు గంగమ్మ జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు, ఈవో అన్ని ఏర్పాట్లు చేశారు.

లక్షలు పోశారు.. లక్షణంగా వదిలేశారు!

పశుపోషకులు, కొనుగోలుదారుల సౌకర్యార్థం గొర్రెల సంతలో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. 14 ఏళ్ల క్రితం ప్రాంతీయ కృషి వికాస్ యోజన పథకం కింద రూ. 25 లక్షల వ్యయంతో ఈ భవనాలు నిర్మించారు. అధికారులు ఈ భవనాలను వినియోగంలోకి తేకుండా గాలికి వదిలేశారు. దీంతో కనీస వసతులు నోచుకోని వ్యవసాయ మార్కెట్ యార్డులోనే వారపు సంతలు నిర్వహిస్తున్నారు.

- గొర్రెల సంతలో నిరుపయోగంగా భవనాలు
- అరకొర వసతుల మధ్య సంత నిర్వహణ
- వ్యాపారులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు


వ్యాపారుల కోసం నిర్మించిన భవనం


గొర్రెల సంత కోసం నిర్మించిన షెడ్డు

పీలేరు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం, ఎర్రగుంటపల్లె పంచాయతీ పరిధిలోని సెట్టిబండ వద్ద రెండు ఎకరాల స్థలంలో గొర్రెల సంత ఏర్పాటుకు 2011, జనవరి 30న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. భవనాల నిర్మాణం కోసం రూ. 25 లక్షల నిధులు మంజూరు చేశారు. సత్వరం నిధులు మంజూరు కావడంతో ఆగమేఘాల పై భవనాలు నిర్మించారు. వ్యాపారుల వెయిటింగ్ హాల్, భవన నిర్మాణం పూర్తి అయినా మార్కెట్ కమిటీ అధికారుల నిర్లక్ష్యంతో నాటి నుంచి నేటి వరకు నిరుపయోగంగా దర్శన మిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణ సమీపంలో ఉన్న వ్యవ సాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రతి బుధవారం పశువుల సంత, ఆదివారం గొర్రెల సంత నిర్వహిస్తున్నారు. వారం వారం లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. తద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం బాగానే వస్తోంది. అయినా, వ్యాపారులు, రైతులకు గుక్కెడు తాగునీరు, టాయిలెట్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతుల కల్పనలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. కూటమి ప్రభుత్వంలో కొత్తగా కొలువు దీరిన పాలక వర్గమైనా గొర్రెల సంత భవనాలను వినియోగంలోకి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే సంత కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలం నేడు కోట్లాది రూపాయల విలువ చేస్తోంది.

మొదటి సమావేశంలో చర్చిస్తాం...



గొర్రెల సంత కోసం కేటాయించిన స్థలం ఎలా వినియోగించుకోవాలన్న అంశం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం మొదటి సమావేశంలో చర్చిస్తాం. రైతులకు వసతుల కల్పనతోపాటు మార్కెట్ కమిటీ ఆదాయ మార్గాలను పెంచుకోవడంపై నిర్ణయం తీసుకుంటాం. మార్కెట్ స్థలాన్ని ఆక్రమణల నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటాం.

-పురం రామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్

'ప్రతిభా పురస్కారం విద్యార్థి ఉన్నతికి దిక్సూచి'


ప్రతిభా పురస్కారాలందుకున్న విద్యార్థులతో కదిరి ఎమ్మెల్యే వెంకటప్రసాద్

కడప మారుతీనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):ప్రతిభా పురస్కారాలు విద్యార్థుల ఉన్నతికి దిక్సూచిలాంటివని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించే క్రమంలో వారిలో నూతనోత్తేజం నింపగలవని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన 59 మంది విద్యార్థులతోపాటు, కడప నగర పరిధిలోని ప్రయివేటు పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు నగదుతోపాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులంలోని వెనుకబాటుతనం, పేదరికం, అసమానతలు తొలగించే విధంగా ప్రతిభా పురస్కారాలు అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఉన్నతస్థానానికి వెళ్లిన తర్వాత కులానికి, సమాజానికి ఉపయోగపడినప్పుడే జీవితానికి నిజమైన సార్థకత సిద్ధిస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులు సైతం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించే ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్యా సుధాకర్, పల్లా నరసింహారావు, మాట్లాడుతూ15 ఏళ్లుగా సంఘం తరఫున ప్రతిభాపురస్కారాలు అందజేయడాన్ని అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులుగోవిందునాగరాజు, సూర్యనారాయణ, కె. భాస్కర్, సుబ్రమణ్యం, వి.మురళీకృష్ణయ్య, చౌడం సూరిబాబు, ఎస్. అంజనేయులు, బి. చంద్రశేఖర్, సి. వెంకటేష్, బి. వెంకటస్వామి, డి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

స్వదేశానికి చేరుకున్న పుష్ప

పీలేరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కువైట్ లో కష్టాలు పడుతున్న కేవీపల్లె మండ లం గ్యారంపల్లెకు కురవపల్లెకు చెందిన పుష్ప ఆదివారం ఉదయం హైదరాబాదుకు చేరుకుంది. కువైట్‌లో తాను నానా ఇబ్బందులు పడుతున్నానని, తనను ఆదుకోవాలని ఆమె వీడియో ద్వారా నారా లోకేశ్ విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. కువైట్‌లోని ఎంబసీ, అక్కడి టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం నేతలతో మాట్లాడి ఆమెను స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు చేశారు. కువైట్ నుంచి ఆమెకు శనివారం రాత్రి విమానం టికెట్ బుక్ చేసి ఆదివారం ఉద యం విమానం ఎక్కించారు. తమ కుమార్తె హైదరాబాదులో సురక్షితంగా ఉన్నట్లు పుష్ప తల్లిదండ్రులు తెలిపారు. పవన్ కళ్యాణ్, నారా లోకేశ్‌ను సోమవారం విజయవాడలో కలిసిన తరువాత స్వగ్రామానికి వస్తుందని వారు తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నిమ్మనపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని వెంగంవారి పల్లి పంచాయతీ మద్దంవారిపల్లెకి చెందిన రమణారెడ్డి (55) ద్విచక్ర వాహనంపై కందూరు వెళ్లి వస్తుండగా బాలినాయునిపల్లి సమీపంలో రంగారెడ్డి కాలనీకి చెందిన చంద్రశేఖర్ (45) నడుపుతున్న ఆటో ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయ పడిన రమణారెడ్డిని ఆసుపత్రికి తరలించారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు యత్నించారు. ఆదివారం స్థానిక శేషమహల్ వీధికి చెందిన సురేష్(39) పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కు టుంబీకులు అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. బసినికొండకు చెందిన శివశంకర్(30) కూలి పనులు చేస్తుంటాడు. అతను కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చాడు. స్థానికులు అతనిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్ట్

తంబళ్లపల్లె, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పేకాట కేంద్రంపై ఆకస్మిక దాడి నిర్వహించిన దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకుని, నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె మండలం కోటకొండ పంచాయతీ మందలవారిపల్లెకు సమీపంలోని ఓ చింత చెట్టు కింద కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న ఏడుగురు పట్టుబడగా, ముగ్గురు వ్యక్తులు పారిపోయినట్లు తెలిపారు. అరెస్టయిన వారి నుంచి రూ.1,01,800లతో పాటు, 5 ద్విచక్రవాహనాలు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రెండు కుటుంబాల ఘర్షణ

మద్దనూరు జూన్15(ఆంధ్రజ్యోతి): వర్షపు నీటి మళ్లింపు విషయమై ఆదివారం అన్నదమ్ముల కుటుంబాల మధ్య ఘర్షణ జరిగినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. మండల పరిధిలోని రాజులగురువాయపల్లి కి చెందిన పక్కపక్కనే నివాసం ఉన్న అన్నదమ్ముల పిల్లలు వర్షపు నీరు మళ్లించేందుకు ఇళ్ల వద్ద మట్టి కుప్పలు వేసుకున్నారు. ఈ విషయమై ఘర్షణపడగా ఒక కుటుంబానికి చెందిన రమణారెడ్డితో మరో ఇద్దరు, మరో కుటుంబానికి చెందిన పుల్లారెడ్డితో మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పోరుమామిళ్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకేసులపల్లె అనుమానాస్పద స్థితిలో ఓమహిళ మృతి చెందింది. ఎస్ఐ కొండారెడ్డి తెలిపిన వివరాలిలా - కలసపాడు మండలం రెంటలపల్లెపంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన మహాలక్ష్మి (25)కి దమ్మనపల్లె పంచాయతీ పరిధిలోని సుంకేసులపల్లెకు చెందిన చెముడూరి నరేంద్రతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ళ, నాలుగేళ్ల వయసు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం నరేంద్ర తన ఆత్తకు ఫోను చేసి మహాలక్ష్మి ఉరి వేసుకుందని, తాను కూడా బతకనని చెప్పాడని ప్రస్తుతం అతని ఫోను కూడా స్విచ్ఛాఫ్ కావడం తో గాలిస్తున్నామన్నారు. మహాలక్ష్మి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాడి రైతుల జీవనోపాధుల పరిశీలన

సంబేపల్లె, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లె పంచాయతీ గండ్లపల్లె గ్రామాన్ని ఆదివారం జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు ప్రతినిధి, నాబార్డు అధికారులు సందర్శించారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో గండ్లపల్లెకు చెందిన 40 మంది పాడి రైతులకు నాబార్డు ఆర్‌హెచ్‌జీఎంఎస్ఎస్ సంస్థ అంబ్రెల్లా ప్రోగ్రాం ఫర్ న్యాచురల్ రిసోర్స్ మేనేజ్మెంట్ (యూపీఎన్ఆర్ఎం) కింద గొర్రెలు, పశువుల కొనుగోలు కోసం సూక్ష్మరుణాలు మంజూరు చేసింది. 2020లో రుణాలు తీసుకున్న రైతులు తాము తీసుకున్న మొత్తాలను చెల్లించేశారు. గడిచిన ఐదేళ్లలో ఆయా రైతుల జీవన స్థితిగతులలో వచ్చిన మార్పులను ఆదివారం కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు ప్రతినిధి లుకినా, నాబార్డు డీడీఎం విజయ విహారి పరిశీలించారు. పాడి రైతుల ఆర్థికాభివృద్ధి, జీవనస్థితి పెరుగుదలకు ఏమైనా చర్యలు తీసుకోవాలా అంటూ వారు రైతులను అడిగి తెలుసుకున్నారు.

ఆవులు, గొర్రెలను మేపుకుని గడిచిన ఐదేళ్లలో తాము ఎంతో అభివృద్ధి సాధించామని రైతులు వారికి తెలియజేశారు. ఆర్‌హెచ్‌జీవీ ఎంఎస్ఎస్ సంస్థ జనరల్ సెక్రటరీ బీవీ రత్నం గ్రామంలోని డెయిరీ యూనిట్లను వారికి చూపించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌హెచ్‌జీవీ ఎంఎస్ఎస్ సంస్థ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న బ్యాంకు, నాబార్డు ప్రతినిధులు

పీలేరు వాసులకు కళాజ్యోతి పురస్కారాలు


కళాజ్యోతి పురస్కారాలతో పీలేరు కళాకారులు

పీలేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పీలేరుకు చెందిన ముగ్గురు కవులు, ఒక నటుడు కళాజ్యోతి జాతీయ పురస్కారాలు అందుకున్నారు. చిత్తూరులోని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంబీ కేశవరెడ్డి సేవా ఫౌండేషన్ సంయుక్తఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరులో నాగయ్య కళాక్షేత్రం 'తెలుగు తేజాలకు కళాభిషేకం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య, నటనా రంగంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖ కవి, తెలుగు భాషా సమితి అధ్యక్షుడు జలకనూరి మురళీధర్‌రాజు, బహుభాషా నటుడు ఖాదర్ బాషా, కవి సరస్వతి శ్రీరాములు రాజు, ఉపాధ్యాయుడు, కళాకారుడు చంద్రశేఖర్, విశ్రాంత డీటీ వెంకట శేషయ్య ఈ పురస్కారాలు అందుకున్నారు. సలకలేటి రాజేంద్రప్రసాద్, గేయ రచయిత సుద్దాల అశోకతేజ, మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు సుబ్రహ్మణ్యం శర్మ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ప్రముఖ రచయిత, వక్త డా.నారాయణస్వామి, కార్యక్రమ నిర్వాహకులు ఎంబీ శ్రీధర్ రెడ్డి, మల్లిఖార్జున దేవేంద్ర రావు పీలేరు వాసులకు పురస్కారాలు ప్రదానం చేశారు.

ఆధునిక తెలుగు కవిత్వానికి ఆద్యుడు శ్రీశ్రీ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు కవిత్వానికి ఆద్యుడు మహాకవి శ్రీశ్రీ అని రచయిత జింకా సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక జేవీవీ కార్యాలయంలో శ్రీశ్రీ వర్ధంతి సభను నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి ఆధునికత జోడించిన కవి శ్రీశ్రీ అన్నారు. సంప్రదాయ కవిత్వాన్ని దిక్కరించి అభ్యుదయ భావాలతో ఆధునిక కవిత్వానికి పునాది వేశారన్నారు. మహాప్రస్థానం ద్వారా తెలుగు సాహిత్యరంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో విరసం వరలక్ష్మి, జనవిజ్ఞాన వేదిక సభ్యుడు ఆరవేటి చంద్రశేఖర్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, వెంకటసుబ్రమణ్యం, రామారావు, సహదేవుడు, సారథి, అక్షయ, తదితరులు పాల్గొన్నారు.


శ్రీశ్రీకి నివాళులు అర్పిస్తున్న జింకా సుబ్రమణ్యం తదితరులు

కోదండరాముడి సన్నిధిలో పునుగోటి విశ్వనాథం

ఒంటిమిట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయాన్ని వెంకటగిరికి చెందిన తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగం కార్యదర్శి పునుగోటి విశ్వనాథం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కోదండరాముని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంఘం డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, సామల లక్ష్మీపతి, జానపాటి మురళి, మేరువ యానాదిరావు, కొత్త శివ, అనుమల ఆయన్న, చింతగింజల సుధా, అవ్వారు రవిశంకర్, ఉప్పల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం


మేరువ సుబ్బమ్మ

కడపక్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు అదృశ్యమైనట్లు చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన మేరువ సుబ్బమ్మ (73) ప్రస్తుతం కడప శ్రీనగర్ కాలనీలో ఉన్న కుమారుడు వద్ద ఉంటోంది. ఈ నెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. కుమారుడు సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆచూకీ కనుగొన్న వారు 9121100520, 9121100521 తెలియజేయాలని వారు కోరారు.

రెడ్డి సామాజిక వర్గం విద్యాపురోగతికి బాటలు

కడప కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కడప రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థుల విద్యా పురోగతికి రెడ్డి సేవాసమితి ఉపకార వేతనాలిస్తూ 25 ఏళ్లుగా ఉన్నత చదువులు చదివిస్తున్నదని రెడ్డి సేవాసమితి అధ్యక్షుడు కె. నాగిరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం రాజీవ్ మార్గ్‌లో గల రెడ్డి సేవాసమితి ప్రాంగణంలో సమితి సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. ఇంజనీరింగ్, వైద్య విద్యార్థులకు రెండు లక్షల రూపాయల ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. 20 25-26 విద్యా సంవత్సరానికి 8, 9, 10, తరగ తులలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అర్హులైన 12 మంది బాలికలకు ఉన్నత విద్య పాఠ శాలలో విద్యా బోధనతో పాటుగా కడపరెడ్డి హాస్టల్‌లో వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, నాయకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఆదినారాయణరెడ్డి, డి.రామ చంద్రారెడ్డి, పి. కుమారి, ఎన్. ఆనందకుమార్ రెడ్డి, ఎల్. మధుసూదన్‌రెడ్డి, సమితి సభ్యులు పాల్గొన్నారు.


సభనుద్దేశించి మాట్లాడుతున్న కె. నాగిరెడ్డి

17 నుంచి నరవాడ జాతరకు ప్రత్యేక బస్సులు

బద్వేలు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నరవాడ వెంగమాంబ జాతరలో భాగంగా ఈ నెల 17 నుంచి 19 వరకు బద్వేలు, పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండుల నుండి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ డీఎం నిరంజన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 మధ్యాహ్నం నుంచి 19న సాయంత్రం వరకు బద్వేలు ఆర్టీసీ బస్టాండు నుంచి పది ప్రత్యేక బస్సులు, పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండు నుండి ఐదు ప్రత్యేక బస్సులను వెంగమాంబ జాతరకు నడుపుతామన్నారు. సాధారణ బస్ చార్జీలే ఉంటాయని చార్జీల పెంపు ఉండదని అన్నారు. బద్వేలు, పోరుమామిళ్లకు చెందిన ప్రజలు జాతరకు వెళ్లేందుకు ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చైతన్య స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు శరవణకుమార్ మృతి



బి.కొత్తకోట, జూన్15(ఆంధ్రజ్యోతి): పట్టణ వాసులకు కొత్తగా పరిచయం అక్కరలేని చైతన్య శరవణకుమార్ ఆదివారం తుదిశ్వాస విడిచారు. వాయల్పాడు కు చెందిన శరవణకుమార్ (55) 1991లో బి.కొత్తకోటకు చేరుకొని చైతన్య స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. గ్రామస్థాయిలో రైతులను చైతన్యపరుస్తూ, ప్రభుత్వ సేవలు, పథకాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. వాటర్‌షెడ్, గ్రామాభివృద్ధి సంస్థల ద్వారా అనేక వ్యవసాయాధారిత పనులు చేయించారు. వివిధ స్థాయిల అధికారులను బి.కొత్తకోటకు రప్పించి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతు సేవా కార్యక్రమాలతో 30 ఏళ్లకు పైగా సేవలు అందించిన శరవణకుమార్ ఇటీవలికాలంలో అనారోగ్య కారణాలతో కాస్త విరామం తీసుకున్నారు. బి.కొత్తకోటలో స్థిరనివాసం ఏర్పరుచుకున్న ఆయన కోరిక మేరకు ఆదివారం వాయల్పాడు సమీపంలోని ఓ కుగ్రామంలో కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు పట్టణ ప్రముఖులు నివాళులు అర్పించారు.

రెండు నెలలుగా పెరగని మిర్చి ధర

● పెట్టుబడులు కూడా రావని రైతుల ఆందోళన

లింగాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధర పతనంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటకాలం ఇప్పటికే సగం పూర్తి కావడంతో పెట్టుబడులు అయినా వస్తాయా రావోనని రైతులు భయపడిపోతున్నారు. లింగాల మండలంలోని ఇప్పట్ల, చిన్నకుడాల, గుణకనపల్లె, అంబకపల్లె, లింగాల, మురారిచింతల, కోమన్నూతల తదితర గ్రామాలలో రైతులు విభిన్న మార్చి నెలలో మిర్చి సాగుచేశారు. ఎకరాకు రూ. 1.3 లక్షల వరకూ పెట్టుబడులు పెట్టారు. దిగుబడులు ప్రారంభమయ్యే సరికి ధర పతనం కూడా ప్రారంభమైంది. దీనికి తోడు తెగుళ్ల బెడద తీవ్రం కావడంతో సస్యరక్షణ చర్యలకు పెట్టుబడులు ఖర్చు చేయాల్సి వస్తోంది. దిగుబడులు మొదలైనప్పటి నుంచి 53 కేజీల బస్తా రూ.500 నుంచి రూ.700కు మించి పెరగడం లేదు. ఇందులో అధికభాగం కోత కూలి చెల్లించేందుకే ఖర్చవుతోందని, పెట్టుబడులు పోను తమకు ఏం మిగులుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. బస్తా ధర రూ.1500కు చేరుకుంటే తమకు కొంతైనా లాభం వస్తుందని అంటున్నారు.


మిరపకాయలను బస్తాలకు ఎక్కిస్తున్న కూలీలు


మిరపకాయలు కోస్తున్న కూలీలు

గిట్టుబాటు ధర కల్పించాలి

ఎనిమిది ఎకరాల్లో పంట సాగుచేశా. పెట్టుబడి సుమారు రూ.9లక్షలు పైనే ఖర్చు అయింది. ఇప్పటికే రెండు కోతలు కోశాం. కూలీల ఖర్చు పోను రూ.2.50 లక్షలు వచ్చింది. సస్యరక్షణ చర్యలకు రూ.45 వేల ఖర్చు అవుతుంది. దరలు పెరిగితే తప్పమిగ్గ రైతులు బాగుపడే పరిస్థితి లేదు. ప్రభుత్వం కల్పించుకుని మిర్చి రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలి

- వెంకటరామిరెడ్డి, రైతు,ఇప్పట్ల, లింగాల మండలం

వృద్ధుల సమస్యలు పరిష్కరిస్తాం

వృద్ధుల వేధింపులపై అవగాహన సదస్సు



వెలుగు ఆశ్రమంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సుభాన్

మదనపల్లె టౌన్/అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వృద్ధుల సమస్యలు వెంటనే పరిష్కరిద్దామని మదనపల్లె జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ అన్నారు. వయోవృద్ధులపై జరుగుతున్న వేధింపులపై అమ్మచెరువు మిట్ట వెలుగు సంస్థలో అవగాహన సదస్సు సంస్థ నిర్వాహకులు ఉదయమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెలుగు వృద్ధాశ్రమంలో వృద్ధులు ఎంతో పుణ్యం చేసుకున్నారన్నారు. అయిన వాళ్ళు కాదన్నా సంస్థ అక్కున చేర్చుకుని ఆలనా పాలనా చూస్తున్నారని తెలిపారు. వృద్ధులు ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నా మా దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. మానసికంగా, శారీరంగా ఇబ్బంది పడితే వెంటనే తెలపాలన్నారు. వయసు మీదపడడంతో ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. సంస్థకు సేవలందిస్తున్న ప్రతి ఒక్కరినీ దుశ్శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. ఏపీ సీనియర్ సిటిజన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాల్‌కృష్ణ, రిటైర్డ్ ప్రొఫెసర్ మునిరత్నం, డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ధనలక్ష్మీ, కేజీఎన్ కూరగాయల మండి యజమాని దాదాపీర్, వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మీ, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సోషియల్ వర్కర్ గీతా, వార్డెన్ స్వీటీ, వృద్ధులు, చిన్నారులు పాల్గొన్నారు.

రాయచోటి టీడీపీ పరిశీలకుడిగా పఠాన్ ఖాదర్‌ఖాన్



సీఎం చంద్రబాబుతో ఖాదర్‌ఖాన్

మదనపల్లె, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గ టీడీపీ పరిశీలకులుగా రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ అధిష్టానం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఆదివారం విలేకరులకు తెలిపిన ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి టీడీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా అధిష్టానం నియోజకవర్గ, మండల స్థాయి పరిశీలకులను నియమిస్తోందన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు నియోజకవర్గంలో ముమ్మరంగా పర్యటించి నేతలు, కార్యకర్తల అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకుని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకీ అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, మంత్రులు లోకేష్, రాంప్రసాదరెడ్డికి, ఎమ్మెల్యే షాజాహాన్ బాషాకు, చమర్తి జగన్మోహన్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లికి వందనం - నిరుపేదలకు వరం



చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

ములకలచెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం నిరుపేదలకు వరం లాంటిదని మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మెన్ కేవీ రమణ అన్నారు. ఆదివారం కోనేటివారిపల్లెలో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు తల్లికి వందనం అమలు చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పట్టెం హరీష్, కొండ్రెడ్డి అశోక్, కొండ్రెడ్డి సుధాకర్, పాస్టర్ శీన, మండ్యం రామయ్య, కొండ్రెడ్డి మురళి, రామచంద్ర, గొడ్డావుల రమణ, సాంబశివ, లక్ష్మీపతి, మునుస్వామి, ఎగవింటి శంకర, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవరెద్దు ఏలుపు



ఏలుపునకు సిద్ధమైన దేవరెద్దు

పెద్దమండ్యం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శివపురం పంచాయతీ గొల్లపల్లిలో దేవరెద్దు ఏలుపు ఘనంగా జరిగింది. గ్రామంలో ఇంటి ఇలవేల్పు దేవరెద్దు పుట్టిన మూడేళ్లకు ఏలుపు నిర్వహిస్తారు. మండలంలోని దేవరెద్దుల సమక్షంలో ఆ దేవరెద్దు పళ్లెం పెట్టడం కోసమే ఏలుపు నిర్వహిస్తారని గ్రామ పెద్దలు వెల్లడించారు. ఈ సందర్భంగా దేవరెద్దులకు వివిధ పుష్పాలు, గజ్జెలు, పట్టీలు వివిధ రకాల వస్త్రాలతో ఆలకరిస్తారు. జాతర లాగనే ఈ దేవరెద్దు ఏలుపు జరుగుతుంది. కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిచారు. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పనిగంటల పెంపుపై పునరాలోచించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేతలు

బి.కొత్తకోట, జూన్15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు ఇకపై పది గంటలు పనిచేయాలని క్యాబినెట్‌లో తీర్మానించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు. ఆదివారం బి.కొత్తకోటలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల పోరాట ఫలితంగానే 8 గంటల పనివిధానం అమల్లోకి వచ్చిందన్నారు. బడా కార్పొరేట్ సంస్థల సేవల్లో తలమునకలైన ప్రభుత్వాలు వారికి లాభాలు చేకూర్చేందుకు 10గంటల పనివిధానాన్ని తీసుకువస్తున్నాయన్నారు. సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటైన తల్లికివందనం పథకంలో చాలామంది పేద తల్లులకు అన్యాయం జరిగిందని దీనిపై ప్రభుత్వం పునరాలోచించి అందరికీ న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా 20న అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు చేపడతామన్నారు. ఏఐటీయూసీ నేతలు సలీంబాషా, ముబారక్, వేణుగోపాల్‌రెడ్డి, బాలక్రిష్ణ, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

గాలేరు-నగరి కాల్వ పనులు ప్రారంభించాలి : సీపీఐ

రైల్వేకోడూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గాలేరు-నగరి కాల్వ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సీపీఐ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాక్రిష్ణయ్య, ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య కోరారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం లక్ష సంతకాల సేకరణ చేపట్టే కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు విడుదల చేసిన వారు మాట్లాడుతూ లక్ష సంతకాల సేకరణలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. 23న రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హంద్రీ- నీవా కాల్వ పనులు వెంటనే పూర్తి చేసి చెరువులు నింపాలన్నారు. తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయాలన్నారు. వెలిగల్లు, ఝరికోన ప్రాజెక్టుల కుడి, ఎడమ కాల్వలు వెంటనే పూర్తి చేసి పూర్తి సామర్థ్యంతో తాగు, సాగు నీరు అందించాలన్నారు. కడప,-బెంగుళూరు రైల్వేలైన్ మదనపల్లె మీదుగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మదనపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పని వెంటనే పూర్తి చేసి మదనపల్లెకు సాగు నీరు అందించాలన్నారు. ఓబులవారిపల్లె-క్రిష్ణపట్నం ఓడరేవు రైల్వేలైన్‌లో ప్యాసింజర్ రైలును నడపాలని కోరారు. మదనపల్లెలో మెడికల్ కాలేజి పనులు పూర్తి చేసి, కళాశాలను ప్రభుత్వమే నడిపి పేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలన్నారు.

వేడుకగా గంగమ్మ జాతర్లు

వైభవంగా బోయకొండ గంగమ్మ, లాభాలమ్మ, నల్లవీర గంగాభవాని, నల్లసాల్లమ్మ, నల్లగంగమ్మ జాతర్లు ● మొక్కులు తీర్చుకున్న భక్తులు

నిమ్మనపల్లి/వాల్మీకిపురం/కలకడ/ తంబళ్లపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి మండలం సామకోట వారిపల్లి, నల్లగొండ, ఆరిపిరెడ్డిగారిపల్లి, యర్రమాలపల్లిలో బోయకొండ గంగమ్మ, లాభాలమ్మ, వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లెలో నల్లవీర గంగాభవాని, కలకడ మండలం నడిమిచెర్లలో నల్లసాల్లమ్మ, తంబళ్లపల్లె మండల కేంద్రం తూర్పు హరిజనవాడలో నల్లగంగమ్మ జాతర్లను గ్రామస్తులు వేడుకగా నిర్వహించారు.



జర్రావారిపల్లెలో గంగాభవాని అమ్మవారు...



లాభాలమ్మ అలయం వద్ద కోలాటం ఆడుతున్న దృశ్యం

నిమ్మపల్లి వద్ద బోయకొండ గంగమ్మ, లాభాలమ్మ జాతర్ల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, భాజాభంత్రీల మధ్య మహిళలు దీలు బోనాలు మోశారు. రాత్రి కోలాటలు, చెక్కభజనలు, వంటి నృత్యాలు ఆకటుకున్నాయి. అనంతరం అమ్మవారికి తెల్లవారుజామున పొట్టేళ్లను ఆగారం ఇచ్చి పండగను వేడుకగా చేసుకున్నారు. గ్రామాల్లో గంగజాతర్లు జరుగు తుండంతో బంధుమిత్రులు, స్నేహి తుల రాకపోకలతో గ్రామాలు కళకళలాడాయి.

● జర్రావారిపల్లెలో ఆదివారం నల్లవీరగంగా భవాని అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేకువ నుంచే ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, తోమాల సేవలు సహా ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు సలిపిండి దీపారాధనలతో ఆలయం వద్ద దీలు బోణాలు సమర్పించి మొక్కు తీరచ్చుకున్నారు. విశేషాలంకరణలతో మూల విగ్రహానికి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ, అన్నదానం చేపట్టారు.

● నడిమిచెర్లలో కొలువైన గ్రామ దేవత నల్లసాల్లమ్మ జాతరను గ్రామస్థులు వేడుకగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంక రించారు. శనివారం రాత్రి బాణ సంచా పేల్చు తూ చాందినీ బండి కోలాహలంగా ఊరేగించారు. ఆదివారం వేకువజామున అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కు తీర్చుకుని ప్రత్యేక పూజలను చేశారు. సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

● తంబళ్లపల్లె మండల కేంద్రం తూర్పు హరిజనవాడలో వెలసిన నల్లగంగమ్మ జాతరను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ పట్టణంలోని రాగిమాను కూడలి, విశ్వనాథ వీధి, ఎంపీపీ పాఠశాల ముందు ప్రధాన రహదారిలో కొలువుదీరిన అమ్మవార్లను మహిళలు 101 బిందెలు నీటితో అభిషేకించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో సామూహికంగా ఆలయం వద్దకు వెళ్లి నల్లగంగమ్మ అమ్మవారికి దీలూ, బోణాలూ సమర్పించి మొక్కులు చెల్లించారు. తంబళ్లపల్లెతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని సల్లంగా కాపాడాలని వేడుకున్నారు.



నడిమిచెర్లలో నల్లసాలమ్మ అమ్మవారు...

చెత్త కార్యాలయాలు

ప్రభుత్వ కార్యాలయాల వద్ద పేరుకున్న చెత్త ● స్వచ్ఛతాహి సేవ అంటే ఇదేనా...?



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట పేరుకున్న చెత్తాచెదారం

వాల్మీకిపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): 'ఇంటిని చూసి ఇల్లాలిని చూడొచ్చనేది పాత సామెత' అయితే ఆఫీసు, పరిసరాలను చూసి అధికారి పనితీరును అంచనా వేయవచ్చనేది నేటి మాట. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నట్లే ఆఫీసు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని వారికి అన్పించినట్లు లేదు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెత్తచెదారం పేరుకు పోవడం ఒక ఎత్తైతే సిబ్బంది తెచ్చుకున్న టిఫిన్ కవర్లు కిటికీల గుండా బయటకు విసరివేయడం, భోజనం ప్లేట్లు ఆఫీసు బయటనే కడగడం గమనార్హం. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు చూస్తే స్వచ్ఛతాహి సేవ అంటే ఇదేనా...? అనే అనుమానం కలుగుతోంది. ఈ దృశ్యాలు చూస్తే అధికారులు ఏ మేరకు శుభ్రత పాటిస్తున్నారో చెప్పకనే అర్థమవుతోంది.

స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, మండల మహిళా సమాఖ్య కార్యాలయాల చెంత చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధంగా తయారైంది. నిత్యం బయటకు లోనికి వెళ్లి వస్తున్న అధికారులకు ఈ సమస్య కన్పిస్తున్నట్లు లేదు. దీన్ని బట్టి చూస్తే సంబంధిత అధికారులకు ఏమాత్రం పట్టరానిదిగా తయారవడం గమనార్హం. ప్రభుత్వ కార్యాలయాల చెంత నెలకొన్న దుర్గంధం పట్ల స్వచ్ఛతాహి సేవ అంటే ఇదేనా సంబంధిత కార్యాలయ అధికారులకు బాధ్యత లేదా అన్న విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ కార్యాలయాల చెంత బాధ్యతగా పరిశుభ్రత పాటించాల్సిన అవసరం ఉందని, అధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీటి వృథాను అరికట్టండి సారూ



వృథాగా పోతున్న నీటితో పాచి పట్టిన రోడ్డు

తంబళ్లపల్లె, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నీటిని పొదుపు చేయాలని సందేశాలు ఇస్తున్నా ఆచరణలో మాత్రం పెట్టడం లేదు. పైపు లైను దెబ్బతిని తాగు నీరు వృథాగా పోతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానిక వెంకటేశ్వర వీధిలో కొన్ని నెలల కిందట తాగు నీటిని సరఫరా చేసే పైపు పగిలిపోయి నీరు రోడ్డు మీద వృథాగా పోతోంది. దీంతో రోడ్డు పాచి పట్టి ఆ దారిన వెళ్లేవారు జారి పడుతున్నారని ఆ ప్రాంతీయులు వాపోతున్నారు. నీటి లీకేజీకి తోడు అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో దుర్వాసన, నీటిలో దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తాం

ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల మల్లికార్జున



రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న నూతన కమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, జూన్15(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభ్యున్నతి కృషి చేస్తామని ఏపీ ఏకలవ్య గిరిజన పరిరక్షణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల మల్లికార్జున అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో సంఘం అన్నమయ్య జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనులు ఎందరో వెనకబడి ఉన్నారని, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ చైతన్య పర్చడానికి మా సంస్థ పని చేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రభుత్వాలు సకాలంలో అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గిరిజనుడికి లబ్ధి జరిగేలా గ్రామ, క్షేత్ర స్థాయిలో కృషి చేస్తామన్నారు. ప్రభుత్వాలు గిరిజనుల కు లోన్స్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ టీఈఏ జిల్లా అధ్యక్షుడు పోలూరి గోపాల్, నాగేశ్వరరావు, రామచంద్ర, సురేంద్రబాబు, వీరనాగయ్య, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా బాలకృష్ణ

ఆదివారం ఏపీ గిరిజనసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల మల్లికార్జున ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా పేడ బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా రాయచోటి రాజబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోలూరు రమేష్, ప్రధాన కార్యదర్శిగా కోనేటి రామాంజులు, కోశాధికారిగా ముంగా వెంకటనారాయణ, జాయింట్ సెక్రటరీగా బేసి అంజనేయులు, యూత్ ప్రెసిడెంట్‌గా మల్లిశ్రీహరి, లీగల్‌అడ్వజర్‌గా మల్లెల శ్రీనివాసులు, మీడియా కన్వీనర్‌గా సాయికిరణ్, మదనపల్లె మండలాధ్యక్షుడిగా వెంకటగిరి నారాయణ కమిటీల్లో ఉన్నారు.

గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు



లక్కిరెడ్డిపల్లె, జూన్15(ఆంధ్రజ్యోతి): అనంతపురం గ్రామంలో వెలిసిన గంగమ్మ తల్లికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. రాయలసీమకే తలమానికంగా నిలిచిన గంగమ్మ తల్లికి దూర ప్రాంతాల నుంచి ప్రతి ఆదివారం వేల సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి ముడుపులు, బోనాలు, మొక్కుబడులు చెల్లిస్తుంటారు. భక్తులకు గంగమ్మ జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ, ఈఓ అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులు

చిట్వేలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రతిభ అన్వేషణ ఉపకార వేతనం(ఎన్ఎంఎంఎస్) పరీక్ష 2025 ఫలితాల్లో చిట్వేలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మాచిరాజు లిఖితసాయి, కోణిరెడ్డి హేమసాయిరెడ్డి, కారేటి యశ్వంత్ ఎంపికయ్యారని తెలిపారు. ఏటా ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఈ పరీక్షలు నిర్వహిస్తుందని, ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల మొత్తం రూ.48 వేలు వస్తుందని తెలిపారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు.

పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత



పెద్దమండ్యం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత నెలకొంది. ఎన్నికలు తర్వాత మండలంలో పోలీసు కొరత వెంటాడుతోంది. ఇదే ఆసరాగా తీసుకుని అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. పథకం ప్రకారం వారి ఆటలు సాగిస్తున్నారు. పెద్దమండ్యం పోలీసు స్టేషన్‌లో 29 మంది పోలీసులకు గాను ప్రస్తుతం 9 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఫలితంగా బందోబస్తు సమయాల్లో పట్ట పగలే దొంగలు విజృంభించి. పలు గ్రామాల్లో చోరీలకు పాల్పబడుతున్నారు. పెద్దమండ్యం పరిధి రెడ్డివారిపల్లి, బిక్కావాండ్లపల్లి, కుడుమలవారిపల్లి, పసలవాండ్లపల్లి గ్రామాల్లో పట్టపగలే ఏకా కాలంలో దుండగులు ఆరు ఇళ్ల, బీరవాల తాళాలు పగలగొట్టి బంగారు, వెండి, నగదు దోచుకెళ్లారు. ఇటీవల మండలంలో జూదం జోరుగా సాగుతోందని సమాచారంతో ఎస్పీ ఆదేశాలతో మండల పరిధిలో స్పెషల్ పార్టీ పోలీసులు జూదర్ల స్థావరంపై మెరుపు దాడులు చేశారు. 16 మంది జూదర్లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 2 లక్షలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. రెండు నెలల కిందట ఎస్ఐ పీవీ రమణ నాటుసారా తయారీ విస్తృత దాడులు చేశారు, కేసులు నమోదు చేశారు. నాలుగు రోజుల కిందట ఈ స్టేషన్ నుంచి ఐదుగురు పోలీసులు బదిలీ కాగా ఆ స్థానంలో నలుగురు పోలీసులు మాత్రమే వచ్చారు. పెద్దమండ్యం పీఎస్‌లో వున్న 9 మంది పోలీసుల్లో ఇద్దరు కోర్టు డ్యూటీలకు వెళతారు. కొత్తగా వచ్చిన ఎస్ఐ, ఏఎస్ఐ, ఒక హెడ్‌కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు విధుల్లో వుంటారు. అతి కష్టమ్మీద ఇక్కడ వీరు విధులు చేస్తున్నారు. కాగా మహిళల మిస్సింగ్ కేసులు కూడా బాగా పెరిగాయి. చాపకింద నీరులా అంసాంఘిక కార్యకలాపాలు పెరిగినట్లు సమాచారం. మండలంలో రాత్రిళ్లు పోలీసుల గస్తీ లేక రాత్రిళ్ల కూడా చోరీలు జరుగుతున్నాయి. ఆకతాయిల ఆగడాలు ఎక్కువైనట్లు పలువురు వాపోతున్నారు. రెండు రోజుల కిందట బండమీదపల్లిలో ట్రాక్టర్‌ను దుండగులు బావిలో పడేశారు. చోరీ కేసులు, పలు కేసులు పెండింగ్‌లో వున్నా ఏమీ పెద్ద సమస్యలు లేవని కొందరు ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని సమాచారం. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని స్టేషన్‌లో పోలీసు సిబ్బంది కొరత తీర్చాలని మండల ప్రజలు కోరారు.

మిట్టమీదవారిపల్లెకు తాగునీటి సమస్య

● ఆరు నెలలుగా ట్యాంకులే శరణ్యం..

● పట్టించుకోని సర్పంచ్, అధికారులు



పైప్‌లైన్ కోసం తీసిన గుంతలు

నిమ్మనపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కొండయ్యగారిపల్లి పంచాయతీ మిట్ట మీద వారి పల్లికి తాగునీటి సమస్య తలెత్తింది. దాదాపు ఆరు నెలలకుపైగా తాగునీరు అందడం లేదు. దీంతో పలుమార్లు వైసీపీ సర్పంచ్ వరలక్ష్మి భర్త శశిధర్‌రెడ్డికి తెలిపినా ఆయన పట్టించుకోలేదు. పైపులైన్ మార్చి కొత్తది వేయాలని గోతులు కూడా తీసి ఆరు నెలలు గడుస్తున్నా పనులు సాగలేదు. దీంతో కొందరు డబ్బు ఇచ్చి ట్యాంకుల ద్వారా నీటిని తెప్పించుకుంటుండగా మరికొందరు దూరప్రాంతం నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. సర్పంచ్ భర్త స్టోర్ డీలర్, పంచాయతీలో ప్రభుత్వ కాంట్రాక్టు పనులు చేసుకుంటూ అందిన కాటికి దండుకుంటున్నాడు. ఏదైనా ఒక పని చేస్తే వైసీపీకి మంచి పేరు రావాలని అనడం గమనార్హం. అయితే ప్రభుత్వంలో టీడీపీ నేతలు సీసీ రోడ్డు వేస్తుంటే దానిని కూడా అడ్డుపడి వైసీపీ ప్రభుత్వంలో తామేమీ సంపాదించేకోలేదని చెబుతున్నాడు. ప్రభుత్వం స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో ఇంటింటికీ చెత్త సేకరణ ప్రారంభించింది. అయితే కొండయ్యగారిపల్లి పంచాయతీలో ఒక్కరోజు కూడా చెత్త సేకరణ చేపట్ట లేదు. దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలకు తూట్లు పొడుస్తున్నారు. దీనికి తోడు అధికారుల సైతం పట్టిం చుకోకపోవడంతో ప్రజల సమస్యలను వర్ణనాతీతం. కనీసం ఉన్నతాధికా రులైనా తాగునీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైసీపీ దుష్ప్రచారం తగదు

వెంకటగిరి ఎమ్మెల్యే రామక్రిష్ణ

సిద్దవటం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనంపై వైసీపీ దుష్ప్రచారం తగదని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగుంట్ల రామక్రిష్ణ అన్నారు. ఆదివారం మాధవరం-1 గ్రామ పంచాయతీ బంగారుపేటలో వెలసిన గంగాభవాని అమ్మవారిని దర్శించుకున్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తీర్పు ఇచ్చినా ఇంకా వారికి బుద్ధి రాలేదన్నారు. తల్లికి వందనం అమలుతో ప్రతి కుటుంబం హర్షాతిరేకాలను చూసి వైసీపీ నేతలు ఓర్వలేకున్నారని పేర్కొన్నారు.

క్షత్రియులంతా ఐక్యంగా ఉండాలి

రాజంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): క్షత్రియులంతా ఐక్యంగా ముందుకెళ్లి అభివృద్ధి సాధించాలని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం క్షత్రియ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ సమావేశం భద్రాచలంలోని క్షత్రియ భవన్‌లో ఫెడరేషన్ ఛైర్మెన్ వెంకపతిరాజు(పెద్దబాబు) భద్రాచలం, శ్రీరామ టెంపుల్ మాజీ ఈఓ, క్షత్రియ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణరాజు ఆధ్వర్యంలో జరిగింది. సెకండ్ ఎగ్జిక్యూటివ్ సమావేశానికి రాజంపేట నుంచి కొండూరు శరత్‌కుమార్‌రాజు, చేజర్ల సుబ్రమణ్యంరాజు, శివరామరాజు, మోహన్‌రాజు, తిరుపతి నుంచి కోనేటి రఘురాజు పాల్గొన్నారు. పేద క్షత్రియులకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. వారి ఉన్నత చదువుల కోసం ప్రోత్సహించాలన్నారు. అనంతరం శరత్‌కుమార్‌రాజు, సుబ్రమణ్యంరాజు, రవిరాజు, శివరామరాజు, మోహన్‌రాజును సత్కరించారు.